ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 20.02.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న తెలంగాణలో పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టాలని, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్ లో పిలుపునిచ్చారు.

2. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికత ఉన్నత విద్యకు ఎంతో అవసరమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.

3. ఓటరు జాబితా సవరణలో రిటర్నిగ్ అధికారులదే కీలక పాత్ర అని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.

4. ఈ రోజు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

------------------------------

**శ్రీధర్ బాబు**

న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో భాగంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు.. ఈ ఉదయం స్వీడిష్ పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణాలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను మంత్రి వారికి వివరించారు. వారితో పాటు.. పలువురు గ్లోబల్ సంస్థల ప్రతినిధులతో కూడా శ్రీధర్ బాబు సమావేశమయ్యారు.

**జీఎస్**

----------------------------

**గవర్నర్**

కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలు ఉన్నత విద్యకు ఎంతో అవసరమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిన్న ప్రారంభమైన భారత విశ్వవిద్యాలయాల సమాఖ్య సెంట్రల్ జోన్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. నైతికత, భారతీయ విలువలు ప్రతిబింబించేలా స్వదేశీ ఏఐ పరిష్కారాలను రూపొందించేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో సాంకేతిక పరిణామక్రమాన్ని గమనిస్తే...'జైజవాన్.. జైకిసాన్'లకు అదనంగా 'జై విజ్ఞాన్.. జై అనుసంధాన్'లు వచ్చాయని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో ఆరు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు చెందిన 108 మంది వైస్ ఛాన్సలర్లు పాల్గొన్నారు.

**జీఎస్**

------------------------------

**శిక్షణ**

ఓటరు జాబితా సవరణలో రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్ర అని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బీఆర్కే భవనంలో నిన్న మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదారాబాద్ జిల్లాలకు చెందిన ఈఆర్వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటరు జాబితా తయారీ, సవరణ, నిర్వహణ విధానాలపై అవగాహన కల్పించారు. త్వరలో చేపట్టనున్న ఎస్ఐఆర్‌పై వివరంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చడంతోపాటు అనర్హుల పేర్లను చట్టబద్ధంగా తొలగించాల్సిన అవసరం ఉందని సీఈవో పేర్కొన్నారు.

**డెస్క్**

-----------------------------------

**సీఎస్**

విత్తనోత్పత్తి రంగాన్ని తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ విత్తన పరీక్ష సంఘం ప్రతినిధులు నిన్న సచివాలయంలో ఆయనతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విత్తన రంగం పురోగతి, నాణ్యత విధానాలపై చర్చించారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ విత్తన ఉత్పత్తి, ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన వెల్లడించారు.

డెస్క్

--------------------------------

**అగ్నిప్రమాదం**

హైదరాబాద్ అమీర్ పేట లోని మైత్రీవనంలో ఈ ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. నీలగిరి బ్లాక్ నాలుగవ అంతస్తులోని ఒక ఇన్‌స్టిట్యూట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు రక్షించుకునేందుకు పలువురు విద్యార్థులు బాల్కనీ నుండి కింది అంతస్తులకు దిగారు. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు.. నిచ్చెనల సహాయంతో పైన చిక్కుకున్న మిగతా విద్యార్థులను సురక్షితంగా కిందకు దించుతున్నారు.

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------------

**సంసద్ ఖేల్**

సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో నిర్వహించిన 'పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్' క్రీడాపోటీల ముగింపు వేడుకలు రేపు మధ్యాహ్నం సికింద్రాబాద్ లోని జిమ్ ఖానా మైదానంలో జరుగుతాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవంలో దాదాపు 34వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారని మంత్రి కిషన్ రెడ్డి సోషల్ మీడియా పోస్టులో తెలియజేశారు. ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం క్రీడా స్ఫూర్తి, ఫిట్‌నెస్, యువత సాధికారతను ప్రోత్సహిస్తూనే

ఉందని మంత్రి అన్నారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ గవర్నర్లు బండారు దత్తాత్రేయ, విద్యాసాగర్ రావు సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు.

**జీఎస్**

-------------------------

**పర్యాటకం**

తెలంగాణ పర్యాటక శాఖ గతయేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను సందర్శించిన పర్యాటకుల గణాంకాలను నమోదుచేసింది. ఆ లెక్కల ప్రకారం.. తొలి మూడు స్థానాల్లో యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర ఆలయాలు ఉన్నాయి. ఆయా క్షేత్రాలకు ఏడాది పొడవునా భక్తులు భారీగా తరలివచ్చారు. నాలుగో స్థానంలో హైదరాబాద్ జూపార్క్ నిలిచింది. గోల్కొండ కోట, చార్మినార్ వంటి చారిత్రక కట్టడాలు టాప్-10 జాబితాలో చోటుదక్కించుకున్నాయి.

**జీఎస్**

-------------------------------------

**సదస్సు**

హైదరాబాద్ ఐఐటీలో MSME Tech Connect 2026 సదస్సు రెండో రోజు కొనసాగుతోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని MSME-SCIP కార్యక్రమం లో భాగంగా ఐఐటి హైదరాబాద్ ఈ సదస్సు నిర్వహిస్తోంది. ఈ వేదిక ద్వారా ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, MSMEలు, కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు, పరిశోధనా సంస్థలు ప్రదర్శనలో ఉంచిన ఆవిష్కరణలను పరిశీలించారు.

**పీటీసీ - సంగారెడ్డి**

-----------------------------------

**దత్తాత్రేయ**

ఛత్రపతి శివాజీ మహరాజ్ మన సమాజానికి విలువలతో కూడిన దిశానిర్దేశం చేశారని, ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు

దత్తాత్రేయ పిలుపునిచ్చారు. హైదరాబాద్ లో భాగ్యనగర్ శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నిన్న రాత్రి జరిగిన ఛత్రపతి జయంతి వేడుకల్లో దత్తాత్రేయ పాల్గొని పలువురికి జాతీయ స్థాయి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సేవాసమితి బాధ్యులు నందనం దివాకర్, నందనం క్రుపాకర్ సహ్ పలువురు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో చిన్నారులు చేసిన వినూత్న న్రుత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**జీఎస్**

----------------------------

**ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం**

ఈరోజు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. సమాజంలో పేదరికం, నిరుద్యోగం, అణచివేత వంటి సమస్యలను తొలగించి, అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యం. ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ 2007లో ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. "సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం పట్ల పునరుద్ధరించబడిన నిబద్ధత" అనేది ఈ యేడాది ఇతివ్రుత్తంగా ఉంది. మన దేశంలో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**జీఎస్**

------------------------------

**బకాయిలు**

సన్న ధాన్యం కొనుగోలుకు సంబంధించిన బోనస్ బకాయిలు రైతుల ఖాతాలలో జమ కాకుంటే రైతులు ఆందోళన చెందవద్దని, పౌరసరఫరాల శాఖ అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు. హన్మకొండ జిల్లాలో 26వేల 173 మంది నుండి సన్న ధాన్యం సేకరించినట్టు అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా నగదు జమ కావడం ఆలస్యం అయినట్టు పేర్కొన్న అధికారులు కోడ్ ముగియడంతో రైతుల ఖాతాలలో బోనస్ జమ చేసినట్టు తెలిపారు.

**పీటీసీ - వరంగల్**

-------------------------

**ఇసుక ట్రాక్టర్లు**

రాజన్న సిరిసిల్ల జిల్లా బొల్లారం మూలవాగులో ఇసుక ట్రాక్ట ర్లను రైతులు అడ్డుకున్నారు. విచ్చలవిడిగా ఇసుకను తరలించడంతో పక్కనే ఉన్న తమ వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పీటీసీ - సిరిసిల్ల**

--------------------------

**రహదారుల భద్రతా కమిటీ**

భద్రాద్రి కొత్తగూడెంజిల్లావ్యాప్తంగా 38 బ్లాక్ స్పాట్లు, 62 ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించినట్లు రహదారుల భద్రతా కమిటీ సమావేశంలో అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**పీటీసీ - భద్రాద్రి**

-----------------------------

**క్రీడలు**

క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో మూడురోజులుగా జరుగుతున్న అండర్-21 రాష్ట్రస్థాయి 8వయూత్ వాలీబాల్ పోటీలు నిన్న ముగిశాయి. పోటీల్లో పది ఉమ్మడిజిల్లాల నుంచి 20జట్లు పాల్గొనగా, ఫైనల్ మ్యాచ్ లో పురుషుల విభాగంలో ఖమ్మం ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో మహబూబ్ నగర్ జట్టు ప్రథమ,

వరంగల్ జట్టు ద్వితీయస్థానాల్లో నిలిచాయి. విజేతలకు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు

**పీటీసీ - సిరిసిల్ల**

-------------------------------------